కోట బోనాలకు ముమ్మర ఏర్పాట్లు

- 7వ తేదీ నుంచి కోట బోనాలు షురూ..
- మొట్టమొదటి బోనాలు కోట నుంచే..
- అమ్మవారికి మొత్తం తొమ్మిది పూజలు

గోల్కొండ: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు గోల్కొండ కోటపై ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కోటపై కొలువుదీరి ఉన్న జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు ఆషాఢ మాసంలో భారీ ఎత్తున బోనాలు నిర్వహిస్తారు. అమ్మవారికి మొత్తం తొమ్మిది పూజలు చేస్తారు. కుతుబ్‌షాహీ రాజుల కాలం నుంచి బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. నిజాం కాలంలోనూ బోనాలు నిర్వహించే వారు.

బోనాల నిర్వహణ ఇలా..

- ఉమ్మడి రాష్ట్రంలో సైతం బోనాల నిర్వహణ.
- తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం బోనాలకు రాష్ట్ర పండుగగా గుర్తింపు.
- గత పదేళ్ల నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బోనాల నిర్వహణ.
- ప్రతిష్టాత్మకంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు. రాష్ట్ర మంత్రి ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాసరాజు


ముస్తాబవుతున్న అమ్మవారు

- లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం.
- బోనాల ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారుల సహకారం.
- నగరం నలుమూలల నుంచి ఆలయాల నిర్వాహకులు ఆలయాల బోనాల సమర్పణ.
- పాత నగరం నుంచి అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాల సమర్పణ.
- గోల్కొండ ఎల్లమ్మ తల్లి తరఫున నగరంలోనే ఇతర ఆలయాలకు పట్టు వస్త్రాల సమర్పణ.
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం.
- మంత్రి ఆదేశాలతో జోరుగా ఏర్పాట్లు.
- మహిళల కోసం ప్రత్యేక బారీ కేడ్‌లు.
- చిన్న పిల్లల తల్లుల కోసం కోటలో ప్రత్యేక టెంట్‌లు.
- మహిళల భద్రత కోసం షీటీమ్‌లు.
- భక్తులకు ఉచితంగా జలమండలి వారి తాగు నీటి ఏర్పాట్లు.
- కోట మెట్లపై కోట నాగదేవత పుట్ట వద్ద ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్‌లు.
- అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించేందుకు వైద్యులతో కూడిన టీమ్‌లు.
- లంగర్‌హౌస్ నుంచి కోట వరకు బోనాలు జరిగే రోజున ప్రత్యేక పోలీసు బలగాలు.
- అందుబాటులోకి వజ్ర, పోలీసు దళం.
- అశ్వక దళం పోలీసులు అందుబాటులోకి.
- దేవాదాయ శాఖ వారి ప్రత్యేక ప్రవేక్షణ.
- భక్తులకు ఉచితంగా ప్రసాద వితరణ.
- కోటకు వచ్చే అన్ని మార్గాల్లో ముస్లింల స్వాగత వేదికలు.
- పోలీసులకు తోడుగా పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు.
- ఊరేగింపు వచ్చే మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ట్రాఫిక్ పోలీసుల బందోబస్తు.
- అమ్మవారి ఆలయ అలంకరణ, ఇతర పనులలో వృత్తిపని సంఘం వారు.
- తరతరాలుగా వంశపార్యపరంగా అమ్మవారికి సేవలు చేస్తున్న వృత్తిపని వారు.
- ఆలయ ఈఓ ఈ.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో చకచకా ఏర్పాట్లు.
- పోలీసు అధికారులు, బల్దియా అధికారుల కోసం కోట మెయిన్ గేట్ వద్ద ఉన్న గౌండ్‌లో భారీ టెంట్.
- కోటకు వచ్చే అన్ని మార్గాలతో పాటు మొత్తం అమ్మవారి ఆలయం వరకు సీసీ కెమెరాల ఏర్పాటు.
- రాత్రి పూట భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు.
- మొదటి రోజు జరిగే ఊరేగింపులో జానపద కళాకారుల విన్యాసాలు.
- వీటన్నిటికీ హైలైట్‌గా పోతరాజుల ధీంకారాలు. అబ్బురపరిచే సిగసత్తుల పూనకాలు.
- బోనాల జాతరను వీక్షించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం.

వంశపారంపర్యంగా సేవలు అందిస్తున్నాం..

కోటలో కొలువుదీరిన అమ్మవార్లకు వృత్తిపని వారు వంశపారంపర్యంగా సేవలు అందిస్తున్నారు. ఎటువంటి స్వార్థం లేకుండా డప్పు, కొమ్ము, దర్జి, కమ్మరి, కుమ్మరి, కంసాలి, చాకలి తదితర వృత్తుల వారు అమ్మవార్లకు సేవలు అందిస్తు అమ్మ కృపకు పాత్రులవుతున్నారు. ఈసారి కూడా బోనాలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూ అధికారుల ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తున్నాం.

– సాయిబాబాచారి, అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు

బోనాల నిర్వహణకు అందరి సహకారం అవసరం


రాజువస్తాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ కోట బోనాల నిర్వహణకు అందరి సహకారం అవసరమని సంఘ సేవకుడు, గోల్కొండ జగదాంబిక అమ్మవారి వృతిపని సంఘం వార్ల సలహాదారులు ఎస్.రాజువస్తాద్ అన్నారు. గురువారం గోల్కొండ కోటలో జరిగిన వృత్తిపని సంఘం వారి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి ఆయనను సన్మానించారు. రాజువస్తాద్ మాట్లాడుతూ.. వృత్తిపని వారి సేవలు వెలకట్టలేనివన్నారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు గౌరవ భృతి కూడా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి అమ్మవారి ఆలయ పూజారి సురేష్‌చారి, నర్సింగ్‌రావు, విజయ్, వినోద్, ప్రసాద్, లీలావతి, రవి, శ్రావణ్, నర్సమ్మ తదితరులున్నారు.

ఉన్నత విద్యామండలి ప్రాంగణంలో నేలకూలిన చెట్టు



నాంపల్లి: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రాంగణంలో ఓ చెట్టు నేల కూలింది. చెట్టు కింద పార్కింగ్ చేసిన కారు, ద్విచక్రవాహనాల మీదపడింది. మూడు ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం మాసాబ్ ట్యాంక్ సమీపంలోని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయ ప్రాంగణంలో చోటుచేసుకుంది. చెట్టు కూలిన ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పినట్లయింది. చెట్టు కూలిన విషయాన్ని ఉన్నత విద్యామండలి కార్యాలయ సిబ్బంది జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించారు.

మేరు కులస్తులను 'బీసీ-ఏ'లోకి మార్చండి


ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని మేరు యువజన సంఘం తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చైర్మన్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మేరు సంఘం నాయకులు ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, నర్సింహస్వామి, వై.శివకుమార్, రఘురామ్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా ఉన్న మేరు కులస్తులకు బీసీ–ఏలోకి మారుస్తే ఎన్నో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం కనీసం మేరు కులస్తులకు ఉచితంగా కుట్టు మిషన్లను కూడా అందజేయలేదన్నారు. మేరు సంఘం నాయకులు ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్ మాట్లాడుతూ..30 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో విశేష సేవలందించిన పోల్కం శ్రీనివాస్‌కు చైర్మన్ పదవి ఇవ్వాలని భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి మేరు కులస్తులకు, పోల్కం శ్రీనివాస్‌కులకు తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

మురుగు సమస్యను పరిష్కరించండి: శివచంద్రగిరి

గౌలిపురా: హనుమాన్‌నగర్ ఫేజ్–3లో నెలకొన్న మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం నాయకుడు ఎ.శివచంద్రగిరి అన్నారు. గురువారం ఆయన హనుమాన్‌నగర్ ఫేజ్–3 బస్తీవాసులతో కలిసి డీఆర్‌డీఎల్ సమీపంలోని జలమండలి కార్యాలయానికి తరలివెళ్లారు. జలమండలి జనరల్ మేనేజర్ మంజీర అందుబాటులో లేకపోవడంతో ఆయన బస్తీవాసులతో కలిసి నోటీస్ బోర్డుకి వినతి పత్రాన్ని అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌలిపురా డివిజన్ హనుమాన్‌నగర్ ఫేజ్–3 తదితర ప్రాంతాల్లోకి ఛత్రినాక పై బస్తీల నుంచి వర్షపు నీరు, మురుగునీరు తమ బస్తీల్లోకి గత కొన్ని రోజులుగా వస్తుందన్నారు. దీంతో స్థానికులు డెంగీ, మలేరియా తదితర వైరల్ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు నర్సింగ్, హనుమంత, అనిత్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.


జలమండలి కార్యాలయంలో నోటీస్ బోర్డుకు వినతిపత్రాన్ని అతికిస్తున్న బస్తీవాసులు

గోల్కొండ ఆసుపత్రిలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: గోల్కొండ కోటలో జరిగే బోనాల్లో పాల్గొనే వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కోసం సీపీఆర్‌పై గురువారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోట బోనాలకు వచ్చే భక్తులు హార్ట్ ఎటాక్‌కు గురైతే వారికి సీపీఆర్ ఎలా నిర్వహించాలో వివరించారు. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ మాట్లాడుతూ..బోనాలలో మొట్టమొదటిసారిగా సీపీఆర్‌పై అవగాహన కల్పించడం మంచి నిర్ణయమన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరిండెంటెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు అలసిపోవడం, ఎండకు స్పృహ తప్పి పడిపోతారన్నారు. ఇటువంటి వారికి హార్ట్ ఎటాక్ వచ్చిందని చాలా మంది పొరపాటు పడుతుంటారన్నారు. ఈ విధంగా సొమ్మసిల్లి పడిపోవడం, స్పృహతప్పిపోయిన వారు కొన్ని నిమిషాల వ్యవధిలోనే స్పృహలోకి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏఎఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ మురళీ తదితరులున్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజ

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే తెలంగాణ మ్యారేజ్ బ్యూరో అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ఎంతో మంది పేద జంటలకు పెళ్లిళ్లు చేయించి పలువురికి ఆదర్శంగా నిలిచారని పేర్కొంటూ మహాలక్ష్మి మ్యారేజీ బ్యూరో వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ గ్రేటర్ ఉపాధ్యక్షులు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. నగరంలో జరిగిన ఆత్మీయ సత్కారం కార్యక్రమంలో పాల్గొని ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సామాజిక సేవా కార్యక్రమాల్లో బుర్ర శ్రీనివాస్ గౌడ్ చేస్తున్న సేవలను మరచిపోలేమన్నారు. శివ తేజ, శేఖర్ గౌడ్, మధుసూదన్ గౌడ్ తదితరులున్నారు.


బుర్ర శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానిస్తున్న కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్

వాహనాల తనిఖీలు


వాహనాల తనిఖీల్లో పాల్గొన్న అడిషనల్ ఇన్‌స్పెక్టర్ సైదులు

సంతోష్‌నగర్: కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఐ.ఎస్.సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ సైదులు ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎస్సైలు అశోక్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి రోజు కోసం వెయిటింగ్

నాంపల్లి: అమావాస్యకు ముందు పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరగడంతో బాధ్యతలు స్వీకరించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అందరూ మంచి రోజు కోసం వేచిచూస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయా పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. కానీ వీరందరికీ అమావాస్య అడ్డంకిగా ఎదురు వచ్చింది. దీంతో బాధ్యతలు తీసుకునేందుకు వాయిదా వేసుకున్నట్లు తెలిసింది. ఈనెల 3న త్రయోదశి బుధవారం సాయంత్రం వేళ 40 మంది ఎస్‌హెచ్ఓలను బదిలీ చేశారు. కాగా ఉత్తర్వులు వచ్చిన రోజు బుధవారం కావడం, మరుసటి రోజు చతుర్దశి, ఆ తర్వాత రోజు అమావాస్య కావడంతో చాలా మంది ఎస్‌హెచ్ఓలు ప్రస్తుతం కొనసాగుతున్న పోస్టింగ్‌లను వదిలి రిలీవ్ కాలేదు. నూతనంగా బాధ్యతలు తీసుకోవాల్సిన ఎస్‌హెచ్ఓలు కొత్త పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేదు. దీంతో ఎవరు బాధ్యతలు తీసుకున్నా అమావాస్య తర్వాతే అనే మాట ఎస్‌హెచ్ఓల నోట వినిపిస్తోంది.

జన్మదిన వేడుకలు


లక్ష్మణ్‌కు మెమొంటో అందజేస్తున్న ప్యారసాని వెంకటేష్

చార్మినార్: ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పాతబస్తీకి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ ప్యారసాని వెంకటేష్,ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధ మల్ల ఆనంద్ గౌడ్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు పాండు యాదవ్ తదితరులు ఆయనను కలిసి మెమొంటో అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్



విజయనగర్‌కాలనీ: నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు పీఎస్ పరిధిలోని కీలకమైన ప్రదేశాలలో స్పెషల్ డ్రైవర్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్ సరిగా లేని యజమానులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..సక్రమంగా వాహనాలపై నెంబర్ ప్లేట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. టప్పాచబుత్ర, జిర్రా, కార్వాన్, తాళ్లగడ్డతదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

కులీ కుతుబ్ షా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పరమేశ్వరి


పరమేశ్వరికి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

శాలిబండ: ప్రభుత్వ కులీ కుతుబ్ షా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గురువారం పి.పరమేశ్వరి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన సైదులు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కొస్గిలో పని చేస్తున్న పరమేశ్వరిని కులీ కుతుబ్ షా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఆమె కళాశాలలో బాధ్యతలు చేపట్టడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ..కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

నంబర్ ప్లేట్‌లు సరిగా లేని 34 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



గౌలిపురా: మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ వాహనాల తనిఖీల్లో 34 ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్లు సరిగా లేకపోవడంతో వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరిగి వాహనాలకు సరైన నంబర్ ప్లేట్‌లను ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాల నంబర్‌లను మరోసారి మారిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని వాహనదారులకు మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గాప్రసాద్ హెచ్చరించారు. అనంతరం వాహనాలను సంబంధిత యజమానులకు అందజేశారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న టీటీఐ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టీటీఐ బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. బషీర్‌బాగ్ ఆదర్శ్‌నగర్‌లోని డిజీ లోన్ స్టార్ పవర్డ్ డిజిటల్ టెక్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఉద్యోగులకు, సిబ్బందికి రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ..రాంగ్‌రూట్ వెళ్లడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. 18 ఏళ్ల నిండిన తర్వాతే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని వాహనాలు నడపాలని ఏసీపీ శంకర్‌రాజు వివరించారు. సంస్థ చైర్మన్ శివరామకృష్ణ, ఆఫీస్ డైరెక్టర్ జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సిల్వర్ జూబ్లీ వేడుకలు


పూజల్లో పాల్గొన్న శశాంక్ తివారి, మహిళా భక్తులు

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ పునర్ నిర్మాణం అనంతరం నిర్వహిస్తున్న సిల్వర్ జూబ్లీ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం ఆలయంలో అమ్మవారికి జరిగిన అభిషేకం పూజా కార్యక్రమంలో పలువురు అధికార, అనధికార ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. పూజలలో సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యుడు శశాంక్ తివారి, ఆలయం కమిటీ ప్రతినిధులు రాజేష్, మధుసూదన్ యాదవ్, ప్రవీన్‌కుమార్ గౌడ్, హన్స్‌రాజ్, బుల్లెట్ శ్రీధర్, నగేష్, సంజయ్ సర్దా, దినేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



యాకుత్‌పురా: యాకుత్‌పురా పరిసరా ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని విభాగల అధికారులు చర్యలు తీసుకోవాలని మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ అసన్ హఫాంధీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. గురువారం వారు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. యాకుత్‌పురా, షేక్ ఫాయాజ్ కామన్, బడాబజార్, గంగానగర్ నాలా తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ..రానున్న భారీ వర్షాలకు వరద నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అలాందార్ వాలాజహి, మాజీ కార్పొరేటర్ షేక్ షకీల్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

గౌలిపురా: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి సూచించారు. స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు గురువారం రాత్రి ఆయన ఎస్సైలతో కలిసి తలాబ్‌కట్టా రోడ్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ చలాన్లను క్లియర్ చేసుకోవాలన్నారు. మైనర్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, నంబర్ ప్లేట్ లేకుండా, ట్రాఫిక్ రూల్స్ తదితర వాటిపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

బీర్ సీసాలో దుమ్మూ, ధూళి


బీర్ సీసాను పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఎస్సై శ్వేతా కుమారీ

చాంద్రాయణగుట్ట: బార్‌లో చల్లటి బీర్ తాగేందుకు వెళ్లిన ఓ మద్యం ప్రియుడు సీసాలో కనిపించిన దృశ్యం చూసి కంగుతిన్నాడు. బీర్ సీసా (కేఎఫ్ లైట్)లో దుమ్మూ, ధూళి గడ్డలు గడ్డలుగా కదలాడడం చూసి అవాక్కైన అతడు వెంటనే సోషల్ మీడియా ద్వారా వైరల్ చేశాడు. పాతబస్తీ ఫలక్‌నుమాలోని కోహినూర్ బార్‌లో ఈ ఘటన వెలుగుజూసింది. దీనిపై సమాచారం అందుకున్న చార్మినార్ ఎక్సైజ్ అధికారులు గురువారం రాత్రి బార్‌కు చేరుకొని బీర్ సీసాతో పాటు మిగతా స్టాక్‌ను కూడా పరిశీలించారు. కాగా తయారీ లోపం జరిగిందని, బీర్ సీసాను స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

రంజన శ్రీవాస్తవకు సంతాపం



అబిడ్స్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘం మాజీ మహిళా విభాగ చైర్‌పర్సన్ రంజన శ్రీవాస్తవ మృతికి తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘం సంతాపం ప్రకటించింది. డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేని, స్వామిగౌడ్, దేవి ప్రసాద్, సుధాకర్, కస్తూరి వెంకటేష్, శైలజ ఆమె మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో జక్కుల బాల్‌రాజ్, ఏలూరి శ్రీనివాస్, ఎంబీ.కృష్ణయాదవ్, శ్రీకాంత్, హరికృష్ణ పాల్గొన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలి


జెండావిష్కరణలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

చాంద్రాయణగుట్ట: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు రూ.26 వేల కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. బండ్లగూడలోని డంపింగ్ యార్డ్ వద్ద రాంకీ సంస్థలో పనిచేస్తున్న కార్మికులతో కలిసి గురువారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ..రాంకీ సంస్థలో పని చేస్తున్న కార్మికులకు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. సంస్థ యాజమాన్యం వారి సమస్యలను చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. కేటగిరీల వారీగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ చాంద్రాయణగుట్ట కార్యదర్శి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో బోనాలకు ఏర్పాట్లు చేయాలి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బోనాలకు భారీ ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి మెమోరాండ్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..ఆలయాల వద్ద, ఆలయాల పరిసరాల్లో వీధి దీపాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు, ఆలయాల అభివృద్ధి చేయాలని కోరారు.

సన్మానం


ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రవి మాదిగ

అబిడ్స్: ధర్మపురి ఎమ్మెల్యే విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకుడు పూజలోల్ల రవి మాదిగ గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.

సీసీ రోడ్డు వేయండి సారూ..


సీసీ రోడ్డు లేక అధ్వానంగా మారిన సాయిదుర్గానగర్‌కు వెళ్లే దారి

జియాగూడ: పురానాపూల్ 100 ఫీట్ల జాతీయ రహదారికి లింకు రోడ్లపై సీసీ రోడ్డు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పురానాపూల్ నుంచి కేసరి హనుమాన్ వరకు వెళ్లే రహదారిలో పలుచోట్ల జియాగూడ బస్తీలకు చెందిన రోడ్లు కూడా జాతీయ రహదారిలో కలిశాయి. జియాగూడలోని పలు బస్తీలకు వెళ్లేందుకు ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి లింకురోడ్లను కలిపారు. కాగా సంవత్సరాలు గడుస్తున్నా సీసీ రోడ్డు లేదా బీటీ రోడ్డు వేయకపోవడంతో ఏ మాత్రం వర్షాలు పడినా రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. ముఖ్యంగా ఇక్బాల్‌గంజ్, దుర్గానగర్, సాయిదుర్గానగర్, ఇమాంపురా హనుమాన్‌నగర్, సంజయ్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన లింకు రోడ్లపై సిమెంటు లేదా బీటీ రోడ్డు వేయాలని స్థానిక బస్తీలవాసులు కోరుతున్నారు. ప్రస్తుతం జియాగూడ రోడ్డు గుండా వెళ్లే బస్సులు పురానాపూల్ జాతీయ రహదారి గుండానే కేసరి హనుమాన్ 2జె బస్టాండ్‌కు చేరుకుంటున్నాయి. పలు బస్తీల లింకు రోడ్ల వద్ద బస్సు షెల్టర్లను నిర్మించినట్లయితే ఆర్టీసీ బస్సులు ఎక్కడానికి వచ్చే ప్రయాణికులకు ఎంతో సౌకర్యకరంగా ఉంటుంది. ఇప్పటికైనా ఆయా విభాగాల అధికారులు, కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తగు చర్యలు తీసుకోవాలని జియాగూడ బస్తీలవాసులు కోరుతున్నారు.